సాక్షి రంగారెడ్డి

శనివారం । 28 । జనవరి । 2023



ఇంటింటా వెలుగులు

కంటి వెలుగు కార్యక్రమంతో ఇంటింటా వెలుగులు నిండాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. 8లో▸



ధ్యానంతో ఆరోగ్యం

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని.. ప్రతిఒక్కరూ సాధన చేయాలని శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. 8లో▸

రెండు రోజుల కస్టడీకి..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని ప్లజెంట్ వ్యాలీలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన ఘటనలో నిందితులుగా జైలులో ఉన్న మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖ మాజీ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌కుమార్ రెడ్డి, మేడ్చల్ జిల్లా, అలియాబాద్‌కు చెందిన బాబు నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు.

న్యూస్‌రీల్

30న ఇంటర్వ్యూలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ నియామకాల కోసం 30న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జయశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10:30 గంటలకు ఎంప్లాయిమెంట్ ఆఫీసుకు రావాలని సూచించారు. టెలీ ఫర్మార్మెన్స్ కంపెనీలో 80 ఉద్యోగాల కోసం ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18నుంచి 30 ఏళ్ల యువతీయువకులు కావాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు అడ్మిషన్ల అవకాశం కల్పిస్తున్నామని, అర్హత కలిగిన పాఠశాలలు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అమయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెసిడెన్షియల్ కేటగిరీలో చేర్చుకునే ఒక్కో విద్యార్థికి రూ.42 వేలు, నాన్ రెసిడెన్షియల్ విభాగంలో చేరే విద్యార్థికి రూ.28 వేల చొప్పున ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందని పేర్కొన్నారు. పదో తరగతిలో కనీసం ఐదేళ్ల పాటు తొంభైశాతం ఉత్తీర్ణత సాధించిన, యాభై శాతం మంది టెన్త్ విద్యార్థులు ప్రథమ శ్రేణిలో పాసైన స్కూళ్లకు మాత్రమే ఈ అవకాశమని తెలిపారు. విధిగా ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని, సాంస్కృతిక కార్యక్రమాలపై శ్రద్ధ చూపే పాఠశాలల యాజమాన్యాలు ఫిబ్రవరి 15లోపు ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

స్టేటస్ రిపోర్ట్ అందజేయండి

'సాహితీ' కేసుల పురోగతి చెప్పాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి దాఖలైన కేసులో స్టేటస్ రిపోర్ట్ అందజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 10వ తేదీకి వాయిదా వేసింది. తాము లక్షలు చెల్లించినా ఫ్లాట్లు ఇవ్వకపోగా, తిరిగి డబ్బులు ఇవ్వడం లేదంటూ సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై రంగారెడ్డి జిల్లాకు చెందిన వెంకట నీలిమాతో పాటు పలువురు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సంగారెడ్డి జిల్లాలో సాహితీ సార్వనీ ఎలైట్ పేరుతో నిర్మిస్తున్న గేటెడ్ కమ్యూనిటీలో తాను ఫ్లాట్ కోసం రూ.48 లక్షలు చెల్లించానన్నారు. ఎన్నాళ్లయినా కంపెనీ నిర్మాణం ప్రారంభించలేదని చెప్పారు. తాము ప్రశ్నించడంతో కంపెనీ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చినా.. ఈ రోజుకూ నిలబెట్టుకోలేదని వెల్లడించారు. ఇలా 1,200 మంది నుంచి దాదాపు రూ.1,500 కోట్లు వసూలు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా తీసుకోవడం లేదంటూ వివరించారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న సింగిల్ జడ్జి.. బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకుని వాటన్నింటిని సీసీఎస్‌కు బదిలీ చేయాలని ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తును కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా పలు కేసులు నమోదు చేశారని, వీటన్నింటిని ఒకే కేసుగా విచారణ జరపాలని కోరుతూ, సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ వెంచర్ నిర్వాహకులు రిట్ అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ కేసుల్లో స్టేటస్ రిపోర్ట్ అందజేయాలని పోలీసులను ఆదేశించింది.

పరీక్షా పే చర్చలో అక్షర

9వ తరగతి విద్యార్థినికి ప్రధాని మోదీ సమాధానం

రాయదుర్గం: 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీని ప్రశ్నించే అవకాశం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్ నవదోయ విద్యాలయలోని 9వ తరగతి చదివే 'అక్షర'కు కలిగింది. ఈ కార్యక్రమంలో అక్షర వీడియో ద్వారా పీఎంను 'మల్టిపుల్ ల్యాంగ్వేజ్‌లను నేర్చుకోవడానికి విద్యార్థులు ఏం చేయాలి?' అని ప్రశ్నించింది. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఈ ప్రశ్నను ఇద్దరు విద్యార్థినిలు ప్రధాని దృష్టికి తేగా ఆయన స్పందిస్తూ దేశంలోని ప్రతి విద్యార్థి కూడా తన మాతృభాషతోపాటు ఇతర భాషలు కూడా నేర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక వాక్యం మాట్లాడడానికి అవకాశం కలిగేలా చూడాలని కోరారు. దేశంలో ఎన్ని భాషలు ఉన్నాయో.. వాటన్నింటిని నేర్చుకోవడానికి ప్రయత్నించాలని విద్యార్థులకు ప్రధాని మోదీ సూచించారు. ప్రధాని ప్రతిష్టాత్మకంగా ఏటా నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చా' కార్యక్రమంలో మొదటిసారిగా జవహర్‌నవోదయ విద్యాలయ విద్యార్థినికి అవకాశం రావడం విశేషం. ఈ కార్యక్రమాన్ని గురువారం ఉదయం శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ డానియల్ రత్నకుమార్ ఆధ్వర్యంలో తిలకించారు.

కౌన్సెలింగ్‌కు ముందే బదిలీలు!

మూడు రోజుల ముందే గుట్టుగా ఆర్డర్స్ జారీ

పారదర్శకంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వమే అక్రమ మార్గంలో బదిలీల ప్రక్రియకు తెరతీసింది. స్థానిక యువతకు, ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూడాల్సిన 'పెద్ద'లే తమ కుటుంబ సభ్యులు, బంధువులు, కార్యకర్తల కోసం సీఎంఓకు వారి పేర్లు సిఫార్సు చేశారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తికి సాక్షాత్తూ ముఖ్యమంత్రి కార్యాలయమే తలొంచి.. ఎడాపెడా ఉపాధ్యాయుల బదిలీలు, పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేయడం జిల్లాలో వివాదాస్పదంగా మారింది. ఈ అక్రమ బదిలీలను నిరసిస్తూ శుక్రవారం పలు ఉపాధ్యాయ సంఘాలు ఎల్బీనగర్ ప్రభుత్వ పాఠశాలలోని కౌన్సెలింగ్ కేంద్రంలో ఆందోళనకు దిగాయి. తక్షణమే ఈ బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశాయి.

- ఇతర జిల్లాల నుంచి కొంత మంది.. జిల్లా పరిధిలో మరికొంత మంది బదిలీ
- సెలవు రోజే గుట్టుగా జాయినింగ్.. పారదర్శకతకు పాతరేసిన వైనం
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు..
- బహదూర్‌గూడ పాఠశాలలో ఆందోళన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్థాన చలనం కల్పించాలని ప్రభుత్వం భావించింది. స్థానికతకు విఘాతం కలగకుండా పూర్తి పారదర్శకంగా ఈ బదిలీల ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఇందుకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఎల్బీనగర్‌లోని బహదూర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఆయా ఉపాధ్యాయుల వివరాల నమోదు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కూడా మొదలు పెట్టింది. వెబ్ కౌన్సెలింగ్ ఇంకా పూర్తి కాలేదు కానీ...అప్పుడే కొంత మంది దొడ్డిదారిన పోస్టులు పొందారు. రెండు రోజుల క్రితం సీఎంఓ నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోస్టింగ్ ఆర్డర్ కాపీలు చేతికందడమే ఆలస్యం ఆ వెంటనే (జనవరి 26 సెలవు రోజు) స్కూలుకు వెళ్లి జాయినై పోయారు. ఇలా ఇతర జిల్లాల నుంచి గుట్టుగా ఇక్కడికి 18 మందికిపై గా వచ్చి చేరినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిలో ముగ్గురు హెచ్‌ఎంలు కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరో 12 మంది అంతర్గత బదిలీలపై వచ్చి కీలక పోస్టింగ్‌లు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని పోస్టింగ్‌లు

తుక్కుగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కృష్ణయ్య జిల్లెలగూడ జీహెచ్‌ఎంగా పోస్టింగ్ పొందారు. అదే విధంగా మాడ్గుల నల్ల చెరువు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మాధవి(ఎస్‌జీటీ) హయత్‌నగర్ పీఎస్ ఎన్జీఓస్‌కు బదిలీ అయ్యారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం మూడు చింతలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.సరిత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రస్తుతం మేడ్చల్ జిల్లాలోని కేశవాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పోస్టింగ్ పొందారు. వీరితో పాటు మరో టీచర్ కూడా రాజీవ్‌గాంధీనగర్ స్కూలుకు బదిలీ అయ్యా రు. వీరితో పాటు శివారు జిల్లాల నుంచి కౌన్సిలింగ్ కు ముందే జిల్లాకు వచ్చి చేరడంతో స్థానికంగా సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులతో పాటు ఇప్పటి వరకు మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలలో అవకాశం లేకుండా పోయింది. అంతర్గత బదిలీలపై వచ్చిన వారితో పాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారంతా కీలకమైన హెచ్‌ఆర్‌ఏ పోస్టులను పొందడంతో స్థానికంగా సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులు నష్టపోవాల్సి వస్తుంది.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి:యూఎస్‌పీసీ

'కౌన్సిలింగ్‌కు ముందే దొడ్డి దారిన ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయుల జాయినింగ్ ఆర్డర్స్‌ను రద్దు చేయాలి. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా కొనసాగించాలి. అవినీతి, ఆరోపణలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వకూడదు. పైరవీకారులకు పట్టం కట్టి సాధారణ ఉపాధ్యాయుల, నిరుద్యోగులకు అన్యాయం చేయొద్దు. ప్రభుత్వం వెంటనే తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ఇచ్చిన ఆర్డర్లను వెనక్కి తీసుకోవాలి. లేదంటే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో స్థానికేతరుల కోటా 45 శాతానికి మించి పోయిందని, తాజాగా ఇతర జిల్లాలనుంచి మరికొంత మందిని ఇక్కడికి బదిలీపై తీసుకురావడంతో జిల్లా యువత భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందని తపస్ రాష్ట్ర ప్రశిక్షణ్ సహ ప్రముఖ్ రవి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

పక్కాగా ప్రక్రియ..

- బదిలీలు, ప్రమోషన్లు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలి
- ఎలాంటి అపోహలకు తావుండొద్దు
- 30లోపు మన బడి పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్లకు మంత్రి సబితారెడ్డి ఆదేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా జరగాలని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ఆదేశించారు. ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ దేవసేన తదితరులతో కలిసి శుక్రవారం ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మన ఊరు – మన బడి పనుల ప్రగతిపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమం కింద తొలి విడతగా ఎంపిక చేసిన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. టీచర్ల ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్ల జాబితా రూపకల్పపై ఆరా తీశారు. ప్రతి మండలంలోని కనీసం రెండు పాఠశాలల్లో ఈ నెల 30 నాటికి మన బడి పనులన్నీ పూర్తి చేసి, సంబంధిత జిల్లాల మంత్రులు, శాసనసభ్యులతో ప్రారంభోత్సవాలు చేయించేందుకు సిద్ధం చేయాలన్నారు. పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున, ఏ చిన్న పని కూడా పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు. ప్రారంభోత్సవానికి సమయం సమీపించినందున తుదిదశలో మిగిలి ఉన్న పనులను వేగవంతం చేయాలన్నారు. డ్యుయల్ డెస్కులు, ఇతర ఫర్నిచర్ ఇప్పటికే ఆయా జిల్లాలకు పంపిస్తున్నామని స్పష్టంచేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎలాంటి అపోహలకు తావీయకూడదని, ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లోనే జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ అమయ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికే గుర్తించిన ఖాళీలు, సీనియార్టీ జాబితాలను ప్రదర్శించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని మంత్రికి వివరించారు. మెడికల్ బోర్డును సైతం ఏర్పాటు చేశామన్నారు. 38 స్కూళ్లలో మన బడి పనులు పూర్తయి, ప్రారంభానికి సిద్ధం చేశామని తెలిపారు. పలు పాఠశాలల్లో ఉపాధి హామీ కింద మంజూరైన కొన్ని పనులు పెండింగ్ ఉన్నాయని, త్వరలోనే వీటిని సైతం పూర్తిచేస్తామని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని స్పష్టంచేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తున్నామని వెల్లడించారు. పేద విద్యార్థులు చదువుకునే సర్కారు బడులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, డీఈఓ సుశీందర్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, నేతలు



కల్యాణశోభలో అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి

ఆమనగల్లు: శెట్టిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం ఆధ్వర్యంలో పూలు, తోరణాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. సర్పంచ్‌తో పాటు ఆలయ చైర్మన్ సింగినిశ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టీ కోట్ల జగన్ ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అర్చకులు కృష్ణమాచార్యులు,రాధాకృష్ణశర్మ, శ్రీకాంత్‌శర్మ, శ్రీకాంతాచార్యులు కల్యాణం జరిపించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్, ఎంపీపీ అనిత విజయ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆమనగల్లు, కడ్తాల జెడ్పీటీసీలు అనురాధ, జర్పుల దశరథ్‌నాయక్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. వట్టిపు నాగేశ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, ఉప సర్పంచ్ వెంకటయ్య, నాయకులు లక్ష్మణ్‌రావ్, రామస్వామి, సాయిబాబా పాల్గొన్నారు.

నేత్ర సమస్యలను తరిమేద్దాం

- 'కంటి వెలుగు'పై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి
- డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు



చింతుల్ల గ్రామంలో కంటి పరీక్షల నిర్వాహణను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

యాచారం: ప్రభుత్వం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకంపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని యాచారం, చింతుల్ల గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. రికార్డుల నమోదు, కళ్లద్దాల పంపిణీ, సిబ్బంది పని తీరుపై ఆరాతీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఏ ఒక్కరూ నేత్ర సమస్యలతో ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతోనే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, డ్వాక్రా సంఘాల మహిళలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోనే అత్యధిక టెస్టులు చేసిన మండల వైద్యాధికారులను అభినందించారు. అనంతరం యాచారం పీహెచ్‌సీ డాక్టర్లతో సమావేశమై వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువ మంది ఏ సమస్యలతో వస్తున్నారు..? రోగులకు సరిపడా మందులు ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణికుమార్, వైద్యాధికారులు రాజ్యలక్ష్మి, ప్రియాంక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి.

అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ధరణీకుమార్, అబ్దుల్లాపూర్‌మెట్ మెడికల్ ఆఫీసర్లు శ్వేత, కౌముదిని, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్, అధికారులు లక్ష్మీనారాయణ,శ్రీనివాస్, హిమాలాల్, బాలమణి, భారతి తదితరులు ఉన్నారు.

ప్రజల చూపు బీఆర్‌ఎస్ వైపు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- కొనసాగుతున్న ప్రజా నివేదన పాదయాత్ర

యాచారం: బీజేపీ, కాంగ్రెస్‌పై నమ్మకం పోవడంతో దేశ ప్రజల చూపు బీఆర్‌ఎస్ వైపు మళ్లిందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తన తనయుడు, బీఆర్‌ఎస్ నాయకుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్రలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. చింతుల్లలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉచిత కరెంటు, రైతుబంధు పథకాలతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. మత్స్య సంపద పెరగడంతో ముదిరాజులు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారని, గొర్రెల పంపిణీ ద్వారా యాదవులు అభివృద్ధి చెందుతున్నారని, దళితబంధు పథకం పేద దళితులకు వరంగా మారిందని తెలిపారు. ఆరు రోజులుగా పాదయాత్ర చేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి నల్లవెల్లిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్‌గౌడ్, పాశ్ప బాషా, నాయకులు యాదయ్యగౌడ్, లక్ష్మీపతిగౌడ్, జిల్లా రాములు, లిక్కి నర్సింహారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



చింతపట్లలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

రాజకీయ జోక్యం తగదు

- దళితబంధు అమలులో పారదర్శకంగా వ్యవహరించాలి
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తే సహించం
- కలెక్టరేట్ ఎదుట కేవీపీఎస్ నేతల ధర్నా
- అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపిక, మంజూరులో రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన వారికి అవకాశం కల్పించాలని కుల వివక్ష పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సామేలు, ఎం.ప్రకాశ్ మాట్లాడుతూ.. 2022– 23 సంవత్సరానికి గాను దళితబంధు కోసం కేటాయించిన రూ.17,700 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ఒక్కో నియోజకవర్గంలో 1,500 మందికి పథకం అందజేయాలని కోరారు. మెజార్టీ శాతం దళితులకు భూములు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య సిబ్బంది, అసంఘటిత కార్మికులుగా కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి వారికి రైతుబంధు ఇవ్వాలని నినదించారు. ఇప్పటికీ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మొదటి విడత కింద కేవలం 679 మందికి మాత్రమే స్కీమ్‌ను వర్తింపజేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద బడ్జెట్‌లో కేటాయింపులు చేసి.. ఆ తర్వాత నిధులను దారి మళ్లిస్తే.. వచ్చే ఎన్నికల్లో దళిత, గిరిజనులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మూడేళ్లుగా జీరో బడ్జెట్ ఉండటంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేదలకు ఎలాంటి పథకాలు అందడం లేదన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు మనోహర్, వెంకటేశ్, చెన్నయ్య, డాక్టర్ బుచ్చయ్య, యాదయ్య,వీరేశం, అశోక్, వీరస్వామి, సత్తయ్య, జంగయ్య, యాదయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

- శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్
- మూడో రోజు కొనసాగిన లాలాజీ జయంత్యుత్సవం



రాహుల్ శర్మ బృందం సంగీత కచేరి

నందిగామ: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం వరిస్తుందని.. మానసికంగా ఆరోగ్యంగా ఉంటే శారీరకంగా దృఢంగా ఉంటామని శ్రీ రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలోని హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రంలో శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు, లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవాలలో భాగంగా మూడో రోజు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్లేష్ పటేల్ పలువురు అభ్యాసీలతో కలిసి ధ్యానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లాలాజీ మహరాజ్ ప్రపంచ వ్యాప్తంగా రామచంద్ర మిషన్‌ను విస్తరించి ప్రతీ ఒక్కరు ఆరోగ్య జీవితంతో ఉండాలని అకాక్షించారని గుర్తుచేశారు. సుమారు 160 దేశాలలో రామచంద్ర మిషన్‌లో ఆరు వేలకు పైగా అభ్యాసీలు ఉన్నారని, వారందరు లాలాజీ జయంతి ఉత్సవాలకు హాజరవ్వడం అభినందనీయమన్నారు. ఈ ఉత్సవాలలో వేలాది మంది దేశ, విదేశాలకు చెందిన అభ్యాసీలు పాల్గొన్నారు. దీంతో కాన్హా శాంతి వనం అభ్యాసీలతో కిక్కిరిసిపోయింది.

ఇంటింటా కంటి వెలుగు

- అంధత్వ రహిత తెలంగాణ ఏర్పాటుకు కృషి
- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మొయినాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో శుక్రవారం ఆమె కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి.. అవసరమైనవారికి మందులు.. కంటి అద్దాలు ప్రభుత్వమే అందజేస్తుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, సర్పంచ్ స్వరూప ఆంద్రూ, ఎంపీడీఓ సంధ్య, చేవెళ్ల డివిజన్ వైద్యాధికారి దామోదర్, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ అరుణకుమారి, మండల వైద్యాధికారి వాణి, సీహెచ్ఓ నర్సింగ్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ భిక్షపతి గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, నాయకులు జయవంత్, ఆంద్రూ, నర్సింహగౌడ్, రాంచందర్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిలుకూరులో లబ్ధిదారులకు కంటి అద్దాలు పెడుతున్న అనితారెడ్డి

కడుపునొప్పి భరించలేక..

వ్యక్తి బలవన్మరణం

చేవెళ్ల: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నారాయణదాస్‌గూడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కందవాడ అనుబంధ గ్రామమైన నారాయణదాస్ గూడ గ్రామానికి చెందిన తెలుగు మల్లేశ్(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆయన కడుపునొప్పితో భాదపడుతున్నాడు. శుక్రవారం కడుపునొప్పి ఎక్కువగా రావటంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

కారు, బైక్ ఢీ..

మాడ్గుల: మండల పరిధిలోని కలకొండ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సీఐ కృష్ణమోహన్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అంకమోనికుంట గ్రామానికి చెందిన చంద్రయ్య, చంద్రశేఖర్ బైక్‌పై ఇర్విన్ వైపు ప్రయాణిస్తున్నారు. ఇర్విన్ నుంచి ఆమనగల్లు వైపు వెళ్తున్న కారు కలకొండ పెట్రోలు బంకు సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ బృందం



రికార్డులు పరిశీలిస్తున్న జాతీయ కమిటీ సభ్యులు

షాద్‌నగర్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ బృందం సభ్యులు డాక్టర్ అరవింద్ శ్రీవత్సవ, డాక్టర్ భారతి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ కమిటీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించడంతో పాటుగా, రోగులకు ఏవిధంగా సేవలు, చికిత్సలు అందిస్తున్నారు, వారికి సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది పై ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించాలని, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని తగిన చికిత్స అందించాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. లేబర్ గది, ల్యాబ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డాక్టర్లు రాఘవేందర్, జయప్రకాశ్, అర్జున్ నాయక్, హెల్త్ సూపర్ వైజర్లు మెర్లిన్, పుష్పలీల, విక్టర్, ఉదయ్‌కుమార్, వెంకటముని, సునీత, స్వప్న, రెడ్యా నాయక్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

రచయిత కాపలాదారు కావాలి

కొంకణి రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత దామోదర్ మౌజో

సాక్షి, సిటీబ్యూరో: ప్రాథమిక హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణకు రచయితలు, కవులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు కావలాదారుగా వ్యవహరించాలని ప్రముఖ కొంకణి రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత దామోదర్ మౌజో అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల కోసం సాహిత్య సృజన చేసే కవులు, రచయితలను హతమార్చడం పిరికిపందల చర్య అన్నారు. సత్యాన్ని ఎదుర్కోలేకనే కల్‌బుర్గి, దబోల్కర్, గౌరీలంకేష్ వంటి మేధావులను, రచయితలను హత్య చేశారని ఆరోపించారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శుక్రవారం విద్యారణ్య స్కూల్‌లో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. హక్కులను కాపాడుకోవాలని చెప్పారు. రచయితగా తాను సైతం తీవ్రమైన హెచ్చరికలు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నట్లు చెప్పారు.

కొంకణి భాష కోసం సుదీర్ఘమైన ఉద్యమం...

గోవా ప్రజలు తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పెద్ద ఉద్యమమే చేయాల్సి వచ్చిందన్నారు. మౌర్యుల కాలం నుంచి ఒక ఉనికిని కలిగి ఉన్న కొంకణి ప్రాంతం పోర్చుగీసు వారి రాకతో విచ్ఛిన్నమైందన్నారు. మతమార్పిడులు, సాహిత్య, సాంస్కృతిక మార్పిడులు తమ ఉనికిని ప్రమాదంలోకి నెట్టాయన్నారు. కొంకణిభాషకు లిపి లేకుండా పోయిందన్నారు. పోర్చుగీసు దాడుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వలసి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో కొంకణి మాతృభాషగా కలిగిన వారు ఆయా రాష్ట్రాల్లోని భాషల లిపినే కొంకణి లిపిగా మార్చుకున్నారన్నారు. గోవా స్వతంత్ర రాష్ట్రంగా అవతరించిన తర్వాత దేవనాగరి భాషను కొంకణి అధికార భాషగా గుర్తించేందుకు తాము సుదీర్ఘ ఉద్యమం చేపట్టినట్లు గుర్తు చేశారు. గోవాలోని మారుమూల పల్లెటూరుకు చెందిన తాను ప్రజల జీవితాలను, కష్టాలను, బాధలను దగ్గర నుంచి చూడడం వల్ల ప్రజల గాథలనే ఇతివృత్తంగా ఎంచుకుని రచనావ్యాసంగం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

వేడుకలు వైవిధ్యం...

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అధ్యక్షత వహించారు. జర్మనీ రాయబార కార్యాలయం ప్రతినిధి స్టీఫెన్ గ్రాబర్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ డైరెక్టర్‌లు అమితాదేశాయ్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



సయ్యద్ రిజ్వాన్ (ఫైల్)



రాజేందర్ (ఫైల్)

చేవెళ్ల: వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి చెప్పకుండా వెళ్లిపోయిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామన్నగూడ చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండలంలోని రామన్నగూడ గ్రామానికి చెందిన సయ్యద్ రిజ్వాన్(35) గ్రామంలో అప్పులు చేశాడు. వారు ఎప్పుడు అడిగినా ఇంట్లో చెప్పకుండా కొన్ని రోజులు దూరంగా ఉండి వచ్చేవాడు. అదే మాదిరిగా ఈనెల 19న ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వ్యక్తి వారం రోజులు గడుస్తున్నా తిరిగి రాలేదు. గతంలో ఒక్కటిరెండురోజుల్లోనే తిరిగి వచ్చేవాడని చెప్పారు. అతని ఫోన్ స్విచ్ఆఫ్ వస్తోందని భార్య సమీనం శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. రిజ్వాన్ భార్య సమీనా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మంఖాల్‌లో కార్మికుడు..

పహాడీషరీఫ్: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మంఖాల్ గ్రామానికి చెందిన కార్మికుడు కూతూరు రాజేందర్(39) ఈ నెల 26న సాయంత్రం 7గంటలకు ఇంట్లో చెప్పకుండా వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై అతడి భార్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 94906 17241 నెంబర్‌లో గానీ సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

కట్ ఆఫ్ డేట్ సవరించండి

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి

షాద్‌నగర్‌టౌన్: ప్రభుత్వం చేపడుతున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లలో కట్ ఆఫ్ డేట్‌ను సవరించేందుకు చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లకోసం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో నవంబర్ 2002 వరకు వెరిఫికేషన్‌కు పిలిచారన్నారు. రంగారెడ్డి జిల్లాలో మాత్రం 2002 ఫిబ్రవరి 28 వరకు పిలిచారని తెలిపారు. జనరల్, ఎస్సీ క్యాటగిరీ వారికి ఒకే కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించడం జరిగిందని వివరించారు. ఎస్సీ క్యాటగిరీ వారికి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించకుండా వెరిఫికేషన్ నిర్ణయించడం సరికాదన్నారు. ఇతర జిల్లాల మాదిరిగానే రంగారెడ్డి జిల్లాలోనూ వెరిఫికేషన్‌కు డిమాండ్ చేశారు.

ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

కేశంపేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టితో ఇసుక తయారు చేస్తున్న అక్రమ ఇసుక ఫిల్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు గురువారం ధ్వంసం చేశారు. మండల పరిధిలోని బోధునంపల్లి, కాకునూర్ గ్రామాల మధ్యనున్న వాగులో ఫిల్టర్లను ఏర్పాటు చేసారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు ఫిల్టర్లపై దాడి చేసి విద్యుత్ స్టార్టర్లను తీసుకెళ్లారు. ఈ దాడుల్లో ఆర్ఐ నివేదిత, వీఆర్ఏలు సతీశ్, శివ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'న్యాక్' మెయిల్‌కు స్పందించండి

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వారక విశ్వవిద్యాలయం న్యాక్ అక్రిడేషన్ సాధించేందుకు విద్యార్థులు తమ మెయిల్‌కు సమాధాన ఇవ్వాలని యూనివర్సిటీ అభ్యాసక సహాయ కేంద్రం కోఆర్డినేటర్ షేక్ మహబూబ్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల మెయిల్‌కు న్యాక్ నుంచి 20 ప్రశ్నలతో కూడిన మెయిల్ వస్తుందని విద్యార్థులు తప్పక తమ మెయిల్స్‌కు జవాబులు గుర్తించి పంపించాలని కోరారు. అనుమానాలు ఉంటే అభ్యాసక సహాయ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.